



స్టీల్‌ప్లాంటుకు రూ.3,295 కోట్లు

- పోర్టుకు రూ.730 కోట్లు
- షిప్‌యార్డుకు రూ.150 కోట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విశాఖపట్నంలోని పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలకు నిధులు కేటాయించారు. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవలసింది స్టీల్ ప్లాంటు. ఈ సంస్థకు రూ.3,295 కోట్లు ఇవ్వనున్నట్టు ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కేంద్రం ఇటీవల స్టీల్ ప్లాంటుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చిన నెల రోజులకే స్టీల్‌ప్లాంటుకు కేంద్రం నుంచి రూ.1,650 కోట్లు ఇప్పించారు. ఆ మొత్తం కూడా ప్యాకేజీలో భాగమేనని ఇటీవల ఇక్కడికి వచ్చిన కేంద్ర మంత్రి కుమారస్వామి స్పష్టంచేశారు. ఇప్పుడు బడ్జెట్‌లో ప్రకటించిన మొత్తం కూడా ప్యాకేజీలో భాగంగానే వస్తుందని ప్లాంటు వర్గాలు తెలిపాయి. మరో సంస్థ విశాఖపట్నం పోర్టుకు రూ.730 కోట్లు కేటాయించారు. సాగర మాల ప్రాజెక్టు కింద రైలు, రోడ్డు ప్రాజెక్టులు అనేకం పోర్టు యాజమాన్యం చేపట్టింది. వాటికి సాయంగా ఈ మొత్తం ప్రకటించారు. మల్కాపురంలోని హిందూస్థాన్ షిప్‌యార్డుకు రూ.150 కోట్లు ప్రకటించారు. ఇది నౌకా నిర్మాణ పనులకు అవసరమైన మౌలిక వసతులు పెంచుకోవడానికి ఉపయోగించనున్నారు.

రూ.12.75 లక్షల వరకూ పన్ను ఉండదు

– అనిల్ బెజవాడ, ట్యాక్స్ కన్సల్టెంట్ కన్వీనర్, సీఐఐ



ఏడాదికి రూ.12 లక్షల వరకూ ఆదాయం వచ్చే వారు ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి ప్రకటించారు. పన్ను శ్లాబులూ వివరించారు. రూ.4 లక్షల వరకూ ఎటువంటి పన్ను ఉండదు. రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు 5 శాతం పన్ను (రూ.20 వేలు), రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ పది శాతం (రూ.40 వేలు) కట్టాల్సి ఉంటుంది. అంటే రూ.20 వేలు+రూ.40 వేలు=రూ.60 వేలు పన్ను పడుతుంది. అయితే ఐటీ రిటర్న్స్ సమర్పించినప్పుడు సెక్షన్ 87ఏ ప్రకారం రిబేట్ కింద మినహాయిస్తారు. దాంతో పన్ను సున్నా అవుతుంది. రూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేదు. ఇది కాకుండా స్టాండర్డ్ డిడక్షన్ కింద రూ.75 వేలు మినహాయింపు ఉంది. అంటే మొత్తంగా చూసుకుంటే రూ.12.75 లక్షలు ఆదాయం వస్తే రూపాయి కూడా పన్ను పడదు.

పొగమంచుతో 3 విమానాలు ఆలస్యం

- ఒకటి రద్దు

గోపాలపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పొగమంచు కారణంగా విజిబిలిటీ లేకపోవడంతో శనివారం ఉదయం విశాఖపట్నం విమానాశ్రయం నుంచి పలు విమానాలు ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి. ఒక విమాన సర్వీస్ రద్దయినట్టు అధికారులు తెలిపారు. తెల్లవారుజామున 5.30 గంటల నుంచి 6.30 వరకు విమానాశ్రయంలో విజిబిలిటీ 100 మీటర్లకు పడిపోయింది. ఈ ప్రభావంతో విమానాల రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. ఉదయం 8.55 గంటలకు విశాఖ నుంచి చెన్నై వెళ్లాల్సిన విమానం 10 గంటలకు బయలుదేరింది. ఉదయం 9.55 గంటలకు విశాఖ నుంచి విజయవాడ వెళ్లాల్సిన విమానం 10.30 గంటలకు, 9 గంటలకు ఢిల్లీ వెళ్లాల్సిన విమానం 9.40 గంటలకు బయలుదేరి వెళ్లింది. ఉదయం 8.35 గంటలకు విశాఖ నుంచి విజయవాడ వెళ్లాల్సిన విమాన సర్వీస్ రద్దయింది.

ఉక్కులో వీఆర్ఎస్‌కు 1,613 మంది దరఖాస్తు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కోసం 1,613 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి గడువు ముగిసే సమయానికి 669 మంది అధికారులు, 944 మంది నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మధ్య తరగతి మందహాసం

వేతన జీవులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఊరట



విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):

మధ్య తరగతి ప్రజలను మెప్పించేందుకు, వేతన జీవులకు ఊరట ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రయత్నం చేశారనే వాదన అధికంగా వినిపిస్తోంది. గత ఏడేళ్లుగా ఆదాయ పన్ను పరిమితులు, పన్నుల విధింపుపై కఠినంగా వ్యవహరించిన ఆమె ఈసారి భారీగా పన్ను మినహాయింపు ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వేతన జీవులైతే ఒక్కపట్టాన నమ్మలేకపోతున్నారు.

ఆదాయ పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడంపై సర్వత్రా హర్షం

ఏడాదికి రూ.12 లక్షలు ఆదాయం అంటే నెలకు లక్ష రూపాయలు సంపాదించేవారు ఎటువంటి పన్ను కట్టాల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి ప్రకటించారు. మొదటి రూ.4 లక్షలకు పన్ను ఉండదని, రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు 5 శాతం పన్ను అంటే రూ.20 వేలు, ఆ తరువాత రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పది శాతం పన్ను రూ.40 వేలుగా పేర్కొన్నారు. ఈ లెక్కన చూస్తే మొత్తం రూ.60 వేలు అవుతుంది. కానీ ఆదాయ పన్ను లెక్కించే ట్యాక్స్ కన్సల్టెంట్లు రిటర్న్ సమర్పించినప్పుడు రిబేట్ వస్తుందని, పన్ను సున్నా అవుతుందని చెబుతున్నారు. ఈ పన్ను విషయమై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పనిచేసే ఓ అధికారి అభిప్రాయాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కోరగా ఈ లెక్కలు అర్థం కావని, ఆదాయాన్ని ముందుగానే లెక్కకట్టి జీతంలో నెలనెలా కోత పెడతారని, ఆ తరువాత ఎంత వరకు వెనక్కి వస్తాయనేది చెప్పలేమన్నారు. నిజంగా ప్రభుత్వం చెప్పినట్టు రూ.12 లక్షల వరకు ఎటువంటి పన్ను పడకపోతే అంతకంటే సంతోషం మరొకటి ఉండదన్నారు.

ఎంఎస్ఎంఈలకు ఊతం

ఇంకా కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పలు పథకాల వల్ల విశాఖ జిల్లా ప్రజలకు భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పారిశ్రామికంగా అభివృద్ధి సాధ్యమవుతుంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.20 కోట్ల వరకు రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించారు.







దేశంలో కోటికి పైగా ఎంఎస్ఎంఈలు ఉండగా వాటి ద్వారానే 45 శాతం ఎగుమతులు జరుగుతున్నాయి. విశాఖపట్నాన్ని తీసుకుంటే స్టీల్‌ప్లాంటు, షిప్‌యార్డు వంటి భారీ పరిశ్రమలకు అనుబంధంగా వందలాది ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయి. వాటిలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వాటికి రుణ రూపేణా ఊతం ఇస్తే ఉపాధి, ఉత్పత్తులు మరింత పెరుగుతాయి.

పెరగనున్న మెడికల్ సీట్లు

- దేశంలోని వైద్య కళాశాలల్లో పది వేల మెడికల్ సీట్లు పెంచుతామని ప్రకటించారు. దీనివల్ల విశాఖపట్నం, పాడేరు, అనకాపల్లి జిల్లాలలోని వైద్య కళాశాలల్లో అదనపు సీట్లు లభిస్తాయి.

షిప్ బ్రేకింగ్ యూనిట్‌కు అవకాశం

కేంద్రం మేరీటైమ్ డెవలప్‌మెంట్‌కు కార్పస్ ఫండ్ కింద రూ.25 వేల కోట్లు కేటాయించింది. నౌకా నిర్మాణాన్ని, షిప్ బ్రేకింగ్ పరిశ్రమను ప్రోత్సహిస్తామని ప్రకటించింది. విశాఖలో నేవీ షిప్ బిల్డింగ్ సెంటర్‌తోపాటు, హిందూస్థాన్ షిప్ యార్డులు నౌకలను నిర్మిస్తున్నాయి. వీటికి ప్రయోజనం కలుగుతుంది. అలాగే పాడుబడిన నౌకలను తుక్కుగా మార్చడానికి ఇక్కడే బ్రేకింగ్ యూనిట్ పెట్టుకునే వెసులుబాటు కలుగుతుంది.

విమానాశ్రయాల్లో కార్గో గోదాములు

దేశంలోని ఎయిర్ కార్గోను పెంచడానికి విమానాశ్రయాల్లో గోదాములు నిర్మిస్తామని ప్రకటించారు. విశాఖ విమానాశ్రయం నుంచి ఆక్వా, ఫార్మా ఉత్పత్తులు భారీగా ఎగుమతి అవుతున్నాయి. విమానాశ్రయంలో సరైన వసతులు లేక రోడ్డుమార్గాన తరలిస్తున్నారు. ఇప్పుడు ఎయిర్ కార్గో గోదాములు వస్తే విమాన ... మిగతా 8వ పేజీలో

మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట

– ఎం.శ్రీభరత్, విశాఖపట్నం ఎంపీ



రూ.12 లక్షల వరకూ ఆదాయంపై పన్ను మినహాయింపు మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట. ఇది చరిత్రాత్మక నిర్ణయం. దేశీయ వినియోగాన్ని పెంచి, పెట్టుబడులను ప్రోత్సహించి, ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుంది. ఈ పన్ను మినహాయింపు వల్ల విశాఖపట్నం వంటి నగరానికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. వ్యాపారాలు విస్తృతం అవుతాయి. పన్ను విధానం మరింత సౌకర్యవంతంగా మారింది.

అభివృద్ధిని కాంక్షించే బడ్జెట్

– గంటా శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే



కేంద్ర బడ్జెట్ అభివృద్ధిని కాంక్షించేలా ఉంది. రూ.75 వేలు స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.12.75 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చారు. కిసాన్ క్రెడిట్ పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ వస్తాయి. రాష్ట్రానికి రూ.23 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారు. దీనివల్ల త్వరితగతిన అభివృద్ధి సాధ్యమవుతుంది.

నౌకా నిర్మాణ సామర్థ్యం పెరుగుతుంది

– శ్రీనాథ్ చిట్టూరి, ఏపీ ఛాంబర్స్ విశాఖ అధ్యక్షులు



వినియోగం ఆధారిత అభివృద్ధి, సులభతర వ్యాపారం, వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెట్టడం అభిలషణీయం. రూ.25 వేల కోట్ల సముద్ర అభివృద్ధి నిధి ఏర్పాటు వల్ల భారతదేశ నౌకా నిర్మాణ సామర్థ్యం పెరిగి ప్రపంచ దేశాలతో పోటీ పడుతుంది.

అన్ని విధాలా మంచి బడ్జెట్

– కంకటాల మల్లిక్, అధ్యక్షులు, ఫ్యాప్సీ



పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన సిబ్బంది కోసం జాతీయ స్థాయిలో ఐదు స్కిల్లింగ్ ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుచేయడం ముదావహం. విద్య, ఆరోగ్య రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం కొత్త బాటలు వేస్తుంది. వ్యాపారాన్ని సులభతరం చేయడానికి ఎంఎస్ఎంఈలకు రుణపరిమితి పెంచారు. అన్ని విధాలా మంచి బడ్జెట్.

తొలిసారి మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు

–శ్రీధర్ కొసరాజు, పూర్వ అధ్యక్షులు, ఐటాప్



తొలిసారిగా బడ్జెట్‌లో మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.2 కోట్ల రుణసాయం ప్రకటించారు. ఐదు లక్షల మందికి ఇది అందిస్తారు. అలాగే డీప్ టెక్నాలజీకి నిధులు కేటాయించడం వల్ల ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. ఎంఎస్ఎంఈలను విభజించడం వల్ల స్టార్టప్‌లకు మరింత మేలు జరుగుతుంది. ఇండియా గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మారడానికి ఫండ్ ఆఫ్ ఫండ్ రూ.10 వేల కోట్లు బాగా ఉపయోగపడతాయి.

దేశ ఆర్థిక మందగమనాన్ని తగ్గించేందుకు దోహదం

– ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ఏయూ ఎకనామిక్స్ విభాగం మాజీ అధిపతి



దేశ ఆర్థిక మందగమనాన్ని తగ్గించేందుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది. గతంతో పోలిస్తే అనేక వర్గాలకు మేలు చేకూర్చేలా కేటాయింపులు ఉన్నాయి. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు భారీగా కేటాయింపులు చేశారు. ప్రజల సంక్షేమానికి నిధులు వెచ్చించారు. గ్రీన్ ఎనర్జీ, మానుఫ్యాక్చరింగ్, ఎంఎస్ఎంఈ, స్మార్ట్ సిటీలు, రోడ్లు, రైల్వేలకు ఆశించిన స్థాయిలో కేటాయింపులు ఉన్నాయి. ఆదాయ పన్ను పరిమితి పెంపు ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పవచ్చు. రైతులకు రుణ పరిమితి మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పెంచారు. ఓవరాల్‌గా చూసుకుంటే బడ్జెట్ ఆశాజనకంగానే ఉంది.

వ్యసనాలతో బతుకులు ఆగం

కుటుంబాలు ఛిన్నాభిన్నం

- పెరుగుతున్న మద్యం, స్మార్ట్ ఫోన్, ఆన్‌లైన్ బెట్టింగ్/గేమ్స్ అడిక్షన్
- వద్దని కుటుంబ సభ్యులు వారిస్తే దాడులకు కూడా వెనుకాడని వైనం
- తాజాగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని వారించినందుకు తల్లిని హత్య చేసిన యువకుడు
- దుర్వ్యసనాలకు బానిసలైన వారిలో మానసిక సమస్యలు
- అప్రమత్తత అవసరం
- కౌన్సెలింగ్, మందుల వినియోగం ద్వారా సాధారణ స్థితికి తేవచ్చునంటున్న వైద్యులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

- 'ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడవద్దని వారించినందుకు తల్లిపై కత్తితో దాడి చేశాడో కొడుకు'...ఈ సంఘటన శుక్రవారం నగరంలోనే చోటుచేసుకుంది.
- 'ఫోన్‌లో గేమ్స్ ఆడుకోనివ్వడం లేదని హరియాణాలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి (15) ఆత్మహత్యకు పాల్పడ్డాడు'
- 'కృష్ణా జిల్లాలో మద్యానికి బానిసై ఒక యువకుడు ఎక్కడికక్కడ అప్పులు చేశాడు. ఒకరోజు తండ్రి గట్టిగా మందలించడంతో అతనిపైనే గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు'

మద్యం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్...వంటి వాటికి బానిసలుగా మారి కొందరు వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పే కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులను శత్రువులుగా భావిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారిపై దాడులకు పాల్పడడం చేస్తున్నారు.

తీవ్రమైన స్థాయిలో ప్రతిఘటన

మద్యం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వాటిని మొదట్లో సరదాగా ప్రారంభిస్తారు. ఆ తరువాత వదలలేని పరిస్థితికి చేరుకుంటారు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసలైన విద్యార్థులు తరగతి గదిలో ఉన్నా వారి ఆలోచనలన్నీ వాటి చుట్టూనే తిరుగుతుంటాయి. ఎంత వేగంగా ఇంటికి వెళదామా?, అని ఆలోచిస్తారు. ఇది క్రమంగా వ్యసనంగా మారి గంటల తరబడి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతుంటారు. మద్యం, బెట్టింగ్‌కు బానిసలైనవారు తమ డబ్బులు లేక పోయినా అప్పు చేసి మరీ తాము కోరుకున్నది చేయాలని భావిస్తారు. ఈ క్రమంలో వద్దని వారించే వారిపై దాడులకు కూడా వెనుకాడరని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఇవీ లక్షణాలు

ఇటువంటి వ్యసనాలు (అడిక్షన్స్)తో బాధపడే వారిలో కొన్ని లక్షణాలు ఉంటాయి. తీవ్రమైన ఆందోళన, గాబరాతో ఉంటారు. ఇంటికి ఆలస్యంగా వస్తుంటారు. వచ్చిన వెంటనే ఫోన్/కంప్యూటర్ ముందు కూర్చుంటారు. తినే సమయంలో కూడా ఫోన్‌తోనే గడుపుతారు. ప్రతి చిన్నదానికి తీవ్రంగా స్పందిస్తుంటారు. గట్టిగా కేకలు వేయడం, అరవడం చేస్తుంటారు. మద్యం/డ్రగ్స్ వంటి వాటికి బానిసలైన వారిలో ఆందోళన, పనిపై శ్రద్ధ పెట్టలేకపోవడం, డబ్బులు కోసం వెతకడం, అప్పులు చేయడం, ఇంటికి ఆలస్యంగా రావడం, ... మిగతా 8వ పేజీలో

డ్రైవింగ్ పరీక్షకు సర్వర్ బ్రేకులు

- తరచూ మొరాయింపు
- అభ్యర్థులకు తప్పని అవస్థలు
- గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు



సర్వర్ పనిచేయకపోవడంతో గంభీరంలోని డ్రైవింగ్ పరీక్ష కోసం వేచివున్న అభ్యర్థులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సర్వర్ తరచూ మొరాయిస్తుండడంతో డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియ సాఫీగా సాగడం లేదు. స్లాట్ బుక్ చేసుకుని పరీక్ష నిమిత్తం హాజరైన వారంతా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఒక్కోసారి పరీక్ష పూర్తికాకుండానే వెనుతిరగాల్సి వస్తోంది.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను గంభీరం వద్ద ఏర్పాటుచేసింది. గత నెల 24 నుంచి సెన్సార్‌లు అమర్చిన ట్రాక్ మీద డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఎల్ఎల్ఆర్ పొందిన తర్వాత పర్మనెంట్ లైసెన్స్ కోసం గంభీరంలోని సెన్సార్ బేస్డ్ ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ మీద వాహనాలను నడపాల్సి ఉంటుంది. వాహనాన్ని సక్రమంగా నడిపినట్టు ట్రాక్ మీద అమర్చిన సెన్సార్‌ల నివేదిక ధ్రువీకరిస్తేనే లైసెన్స్ జారీ అవుతుంది. ఏమాత్రం ట్రాక్ మీద వాహనం ఇంజన్ ఆగిపోయినా, ట్రాక్ వాల్స్‌ను ఢీకొట్టినా సరే డ్రైవింగ్ పరీక్షలో ఫెయిల్ అయినట్టు ఆటోమేటిక్‌గా ఫలితం వస్తుంది. డ్రైవింగ్‌లో పూర్తిగా శిక్షణ పొందిన తర్వాత మరోసారి లైసెన్స్ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో ... మిగతా 8వ పేజీలో


ప్రమాదంలో మృతి చెందిన ప్రదీప్

బైక్ బోల్తా పడి దివీస్ ఉద్యోగి మృతి

భీమునిపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌రోడ్ ఎర్రమట్టి దిబ్బల సమీపంలో శుక్రవారం రాత్రి బైక్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చిప్పాడ దివీస్ వసతి గృహం నుంచి ముమ్మాని ప్రదీప్ (28), కె. లోకేశ్ శుక్రవారం బైక్‌పై నగరానికి వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా ఐఎన్ఎస్ కళింగ దాటిన తరువాత మార్లిన్ కే రెస్టారెంట్ సమీపంలో ఉన్న మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటన రాత్రి 10.30 సమయంలో జరగ్గా పోలీసులకు అర్ధరాత్రి సమాచారం అందింది. వెంటనే వారు 108 వాహనంలో బాధితులను కేజీహెచ్‌కు తరలించారు. మార్గ మధ్యలో ప్రదీప్ మృతి చెందగా, లోకేశ్ చికిత్స పొందుతున్నాడు. అతని ఆరోగ్య పరిస్థితి బాగానే వుందని వైద్యులు తెలిపారు. మృతుడు విజయనగరం జిల్లా ఎల్. కోట మండలానికి చెందినవాడని, అవివాహితుడని పోలీసులు చెప్పారు. వారిద్దరూ దివీస్ కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తున్నారన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఎస్ఐ హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే గంటాకు వినతి

ఎండాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని టీఎన్‌టీయూసీ వార్డు అధ్యక్షుడు ఉప్పులూరి గోపి, 8వ వార్డు తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు కోరారు. శనివారం వారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును నగరంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు.వార్డులో ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రుషికొండ (ప్ర)భుత్వ పాఠశాల, సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల ఉన్నాయన్నారు. వీటిల్లో పదో తరగతి విద్యార్థులు 150 మంది వరకు ఉన్నారని, వారికి స్థానికంగా పరీక్షా కేంద్రం లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాయాల్సి వస్తుందని చెప్పారు. దీనివల్ల వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారని, కేంద్రం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విన్నవించారు.

చదువుల తల్లికి వందనాలు

- ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం
- తొలిరోజు ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.తొలిరోజు కార్యక్రమాలను పూర్వ విద్యార్థుల ఆనందోత్సాహాల నడుమ అత్యంత ఉల్లాసంగా, ఉత్సాహంగా చేపట్టారు ముందుగా ముఖ్య అతిథి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉత్సవాలకు గురుతుగా కట్టమూరి లక్ష్మీకాంతం (ఆనందం) తనయులు నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ జూనియరు కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుని పాఠశాల పూర్వ విద్యార్థులు, ఝార్ఖండ్ పోలీసు ఐజీ క్రాంతికుమార్, హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషినల్ కమిషనరు వీఎం మహిధర్, బీఎస్ఎఫ్ రిటైర్డ్ కమాండెంట్ మూర్తి, చిట్టివలస జూట్‌మిల్లు వైస్ ప్రెసిడెంట్ ఎం. కాళిదాసు, తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఒక్క చదువే కాకుండా సమాజంలో ఎలా బతకాలి, నలుగురితో ఎలా ఉండాలని చెబుతారన్నారు. ఇకపై ఏటా పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి తన తండ్రి జ్ఞాపకార్థం రూ.10 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు అందించనున్నట్టు ప్రకటించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషినల్ కమిషనరు మహిధర్ మాట్లాడుతూ తన తండ్రి డీఎఫ్‌వోగా భీమిలిలో పనిచేయడం వల్ల తాను 8,9,10 తరగతులు ఇక్కడే చదువుకున్నానని చెప్పారు. పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తనను సంప్రతిస్తే ఆర్థిక సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం గంటా ఉత్సవాల సావనీర్‌ను ఆవిష్కరించారు. తరువాత ఓపెన్ టాప్ జీపును ఐపీఎస్ క్రాంతికుమార్, ఐఆర్ఎస్ మహిధర్ నడుపగా, గంటా ఉత్సవ్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పట్టణ పుర వీధుల మీదుగా సాగింది. అంతకముందు ఉత్సవ వేదికపై కేజీబీవీ బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నేరేళ్లవలస ఉమా మహేశ్వర సంపత్ వినాయక కోలాటం ప్రదర్శన,ది సన్ స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు అలరించాయి. మహిళల తీన్‌మార్ డప్పు వాయిద్యం, బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల విశ్రాంత టీచరు పట్నాల వెంకట జగన్మోహనరావును గంటా శ్రీనివాసరావు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే గంటాను ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాసరావు, కన్వీనరు మైలపల్లి షణ్ముఖరావు, ఎంపీ పార్వతీశం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కొప్పల రమేశ్, గొలగాని నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు



సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా కేజీబీవీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పెళ్లి సంబంధాలు కుదరడం లేదని..

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో దూకి యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాలు వచ్చినా కుదరకపోతుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాతయ్యపాలెం ప్రాంతానికి చెందిన దేవవరపు శివరామ్ (28) తల్లి రాజేశ్వరి, సోదరుడు హరిరాజుతో కలిసి నివసిస్తున్నాడు. సంతల్లో వస్తువులు విక్రయిస్తూ జీవనోపాధి పొందే శివరామ్‌కు మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదు. ఇటీవల పెళ్లి సంబంధాలు కుదిరినప్పటికీ, ఆ తర్వాత రద్దవుతుండడంతో మనస్తాపానికి గురై ముభావంగా ఉండేవాడని కుటుంబీకులు తెలిపారు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చిన శివరామ్ తన సోదరుడికి ఫోన్ చేసి మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు వచ్చానన్నాడు. శివరామ్ మానసిక స్థితి తెలిసి ఆందోళనకు గురైన హరిరాజు తమ బంధువులతో కలిసి రిజర్వాయర్ వద్దకు వచ్చాడు. అక్కడ శివరాజు ద్విచక్ర వాహనాన్ని, జలాశయం గట్టు వద్ద చెప్పులను గుర్తించారు. వెంటనే పెందుర్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు.

వంజంగి కాదు.. అనంతుని గిరి

ప్రస్తుత సీజన్‌లో కురుస్తున్న మంచుతో మైదాన ప్రాంతాలు ఏజెన్సీలను తలపిస్తున్నాయి. పద్మనాభం, సింహాచలం, మధురవాడ పరిసర ప్రాంతాల్లో శనివారం పడిన మంచు ఆయా ప్రాంతాలకు సరికొత్త అందాలను తీసుకువచ్చాయి. ముఖ్యంగా పద్మనాభంలోని అనంతుని గిరి, ఘాట్ రోడ్డుపై హిమ సొగసులు స్థానికులకు కొత్త అనుభూతిని కల్పించాయి.

- పద్మనాభం/సింహాచలం/మధురవాడ, ఆంధ్రజ్యోతి


మధురవాడ పరిసరాల్లో మంచు


సింహాచలం : అడివివరంలో ఉదయం 7.30 వరకు కమ్ముకున్న మంచు


అనంతుని గిరిపై నుంచి పాల సంద్రంలా కనిపించిన మంచు

కుంభమేళా ప్రత్యేక రైలుకు విశేష ఆదరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 4న విశాఖ నుంచి గోరఖ్‌పూర్‌కు ప్రవేశపెట్టిన 08588 నంబరు గల ప్రత్యేక రైలుకు శనివారం ఉదయం రిజర్వేషన్ బెర్తులు విడుదల చేసిన గంటలోనే అన్ని క్లాసులు నిండిపోయి నిరీక్షణ జాబితాకు చేరింది. కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేందుకు విశాఖ నుంచి శాశ్వత ప్రాతిపదికన నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ప్రత్యేక రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. విశాఖ-గోరఖ్‌పూర్ మధ్య ఒక ట్రిప్పు (రాను పోను) మాత్రమే అందుబాటులో ఈ రైలులో బెర్తులు నిండిపోయాయి. భువనేశ్వర్ నుంచి అనుసంధాన రైళ్ల ద్వారా ప్రయాగ్ చేరేందుకు ప్రయత్నించిన ప్రయాణికులకు బెర్తులు లభించక నిరాశ ఎదురైంది. దీంతో కుంభమేళాకు వెళ్లాలని ఆసక్తితో ఉన్నవారు మరిన్ని ప్రత్యేక రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 4న విశాఖ నుంచి గోరఖ్‌పూర్‌కు (08588) ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు మీడియా ద్వారా ప్రకటన వచ్చిన వెంటనే ప్రయాణికులు అప్రమత్తమయ్యారు.ఈ రైలుకు రిజర్వేషన్ సదుపాయం శనివారం ఉదయం అందుబాటులోకి రావడంతో అప్పటికే ఇంటర్‌నెట్ ముందు కూర్చొని సిద్ధంగా ఉన్నవారు ఆగమేఘాలపై తమ వివరాలను నింపి టికెట్లు పొందారు. బృందాలుగా వెళ్లేందుకు సిద్ధమైన కొందరు ఉదయం ఎనిమిది గంటలకే రైల్వే రిజర్వేషన్ కార్యాలయానికి చేరుకుని టికెట్ పొందే ప్రయత్నాలు చేశారు. దీంతో గంటలోనే బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెట్టిన ప్రత్యేక రైలు కేవలం ఒక ట్రిప్పుకు మాత్రమే పరిమితం చేయడంతో బెర్తులు లభించని వారు నిరాశ చెందారు.

వెంకన్నకు క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి పూజలు


కుటుంబ సభ్యులతో నితీష్‌కుమార్‌రెడ్డి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న టీటీడీ ఆలయం అద్భుతంగా ఉందని ప్రముఖ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడి శ్రీవారిని చూస్తే తిరుమల స్వామివారిని చూసినట్లే ఉందన్నారు. కొండపై నుంచి సముద్రం అందాలు ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయని చెప్పారు.

'పాలకులు ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి'


రామ యంత్రానికి పూజలు చేస్తున్న కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పాలకులు ప్రజల అభిప్రాయాలను ఎలా గౌరవించాలో రామాయణం చెబుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా శనివారం ఆయన అయోధ్యకాండలో సీతారామ కల్యాణం, శ్రీరాముడి పట్టాభిషేక యత్నం, ఇతర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలతో బతుకులు ఆగం

... 7వ పేజీ తరువాయి

కుటుంబ సభ్యులతో మాట్లాడకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. బెట్టింగ్ అడిక్షన్‌తో బాధపడేవారిలోనూ ఇటువంటి లక్షణాలే ఉంటాయి. అప్పులు చేయడం, పనిపై శ్రద్ధ పెట్టకపోవడం, తప్పుడు మార్గాలను అనుసరించడం, కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలుచేయడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇంట్లో తెలియకుండా భారీగా అప్పులు చేస్తుంటారు.

చికిత్స ఇలా..

ఇటువంటి వ్యసనాలతో బాధపడే వారికి లక్షణాలనుబట్టి చికిత్స చేయించాల్సి ఉంటుంది. మందులు, కౌన్సెలింగ్, గ్రూప్, ఫ్యామిలీ థెరపీలతో సాధారణ స్థితికి తీసుకురావచ్చు. వీరి వ్యవహారశైలిని నిశితంగా గమనించడం ద్వారా ప్రాథమిక దశలోనే చాలావరకు సమస్యను గుర్తించేందుకు అవకాశం ఉంది.

అన్ని వయసుల వారిలోనూ..

ఫోన్ అడిక్షన్ తొమ్మిది నుంచి 25 ఏళ్లలోపు వారిలో అధికంగా కనిపిస్తోంది. మద్యం/డ్రగ్స్ వంటి వాటికి బానిసలుగా మారుతున్న వారిలో 20 నుంచి 50 ఏళ్లలోపు వయసువారు ఉంటున్నారు. జూదాలకు అలవాటుపడిన వారిలో 20 నుంచి 40 ఏళ్లలోపువారు అధికంగా ఉంటున్నారు.విద్యార్థులు, ఉద్యోగాలు చేసే వాళ్లు ఈ తరహా వ్యసనాలకు బానిసలుగా మారుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తించడం కీలకం

- డాక్టర్ రామిరెడ్డి, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

వ్యసనం స్థాయికి వెళ్లడానికి కొంత సమయం పడుతుంది. కనీసం మూడు నుంచి ఆరు నెలలు సమయంలో అలవాటు వ్యసనంగా మారి అది లేకపోతే ఉండలేని స్థితికి చేరుతుంది. ఈ సమయంలోనే సదరు అలవాట్లను గుర్తించి వాటికి వారిని దూరం చేయడం చాలా సులభం. వ్యసనం నుంచి విముక్తి చేసేందుకు మందులు, కౌన్సెలింగ్ వంటివి ఉన్నాయి. అందుకు వాళ్లు సహకరించే పరిస్థితి కొన్నిసార్లు ఉండదు. ఈ తరహా వ్యసనాలతో బాధపడే వారిలో కొన్ని మానసిక సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ప్రవర్తించే తీరు భిన్న రకాలుగా ఉంటుంది. సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించడం అత్యంత కీలకం.

మధురవాడలో పెరిగిన భూముల ధర

మధురవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం అత్యధికంగా 147 రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.5,33,89,061 ఆదాయం లభించింది. శుక్రవారం రాత్రి వరకు కక్షిదారులు కార్యాలయంలోనే ఉన్నారు. కొంతసేపు సర్వర్ ఇబ్బంది పెట్టినప్పటికీ రిజిస్ట్రేషన్‌లకు వచ్చేవారు వేచి చూశారు. శనివారం నుంచి భూముల విలువ పెరగడంతో ఈ తాకిడి పెరిగింది. కాగా పీఎంపాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా గజం స్థలం ధర రూ. 40 వేలు ఉండగా రూ. 44 వేలుకు పెరిగింది. అలాగే వుడా రెవెన్యూ లేఅవుట్‌లో రూ. 45 వేలు ఉండగా రూ. 55 వేలుకు, చంద్రంపాలెంలో రూ. 30 వేలు ఉండగా ఇప్పుడు రూ.33 వేలకు పెరిగింది. బక్కన్నపాలెంలో గజం ధర గతంలో రూ. 20 వేలు ఉండగా ఇప్పుడు రూ. 24 వేలుకు చేరింది. కొమ్మాదిలో గజం స్థలం ధర రూ. 18 వేలు ఉండగా ప్రస్తుతం రూ. 21 వేలకు చేరింది.

అప్పన్నను దర్శించుకున్న విదేశీయులు


స్వామివారి సన్నిధిలో విదేశీయులు

సింహాచలం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అమెరికాకు చెందిన 12 మంది విదేశీయులు వరాహలక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకున్నారు. హైందవ సంప్రదాయం ప్రకారం దుస్తులు ధరించి, నుదుటన బొట్టు పెట్టుకుని అంతరాలయంలో స్వామివారిని దర్శించుకుని, ఉచిత ప్రసాదం స్వీకరించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలోని శిల్ప సంపదను, సింహగిరి అందాలను తిలకించి మురిసిపోయారు.

రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ. 2.9 లక్షల విలువ చేసే 58 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన ప్రసన్నరాజ్ కిశోర్ బలియారసింగ్, రాహుల్ పాని, పింటు దాస్ గంజాయిని రైల్లో ముంబయికి రవాణా చేస్తూ దొరికిపోయారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష

భీమునిపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ అన్న అంశంపై శనివారం పరీక్ష నిర్వహించారు. 324 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 300 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు.

'పేదలకు మేలు చేసే బడ్జెట్'

కొమ్మాది, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్ నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో మేలు చేకూరుస్తుందని మధురవాడ బీజేపీ అధ్యక్షుడు ఎండ అప్పారావు అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇచ్చారని, పోలవరం, స్టీల్‌ప్లాంటుకు నిధుల కేటాయింపు శుభపరిణామమని పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు ?

ఎండాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడ్ని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ సైబర్ క్రైం పోలీసులు ఇటీవల పెదవాల్తేరులోని గాయత్రి టవర్స్‌లో దాడి చేసి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు చేయాల్సి ఉండడంతో పోలీసులు ప్రధాన నిందితుడి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు.

డ్రైవింగ్ పరీక్షకు సర్వర్ బ్రేకులు

... 7వ పేజీ తరువాయి

స్లాట్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిరోజూ డ్రైవింగ్ పరీక్షకు సగటున 200 మంది హాజరవుతున్నారు. శనివారం కూడా సుమారు 200 మందికి పరీక్షల కోసం స్లాట్‌లు కేటాయించారు. చాలామంది ఉదయం పది గంటలకే గంభీరంలోని డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. అధికారులు వారి దరఖాస్తుల వెరిఫికేషన్ చేసిన తర్వాత ట్రాక్ మీద డ్రైవింగ్ పరీక్షకు పంపిద్దామనుకునేసరికి సర్వర్ కనెక్ట్ కాలేదు. దీంతో అభ్యర్థులంతా రెండు గంటలపాటు అక్కడ నిరీక్షించారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే తమ చేతులో ఏమీ లేదని ట్రాక్ పనితీరు పూర్తిగా టెక్నాలజీ ఆధారంగా ఉంటుందని, దీనిని పర్యవేక్షించేవారు కూడా ఢిల్లీలోనే ఉంటారని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వారికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించి సమస్య పరిష్కారించాలంటూ కొందరు అభ్యర్థులు అక్కడున్న అధికారులను కోరారు. శని, ఆదివారాలు ఢిల్లీలో సెలవు దినాలు కావడంతో వారు తమకు అందుబాటులో ఉండరంటూ అధికారులు సమాధానం చెప్పడంతో చాలామంది తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వేతన జీవులకు ఊరట

మధురవాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన జీవులకు ఆదాయ పన్నులో ఇచ్చిన మినహాయింపు ఊరట కలిగించిందని ఎస్‌టీయూ (స్టేట్‌టీచర్స్ యూనియన్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు హర్షం వ్యక్తం చేశారు. నూతన విధానంలో వార్షిక ఆదాయం రూ. 12 లక్షలు వరకు పన్ను లేకపోవడం లక్షలాది మందికి ఆనందం కలిగించే అంశమని పేర్కొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురంలో సురేశ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 200 మందికి పరీక్షలు చేసి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండి సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీ సీజ్

పద్మనాభం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో అనధికారికంగా మట్టి రవాణా చేస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసినట్టు పోలీసులు చెప్పారు. ఈ లారీ వేరే ప్రాంతం నుంచి మట్టి లోడుతో వస్తుండగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి, తహసీల్దార్‌కు నివేదించామన్నారు.

'కూటమిపై విమర్శలు తగవు'

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పెద ఎర్నినాయుడు, రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి లక్ష్మి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. రెడ్డిపల్లిలో జరిగిన వైసీపీ మండల స్థాయి సమావేశంలో ఆ పార్టీ నాయకులు సీఎం చంద్రబాబును విమర్శించడం సరికాదన్నారు.

అలరించిన కోయ నృత్యం


నృత్య ప్రదర్శనలో కళాకారులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అరకు చలి ఉత్సవాల్లో భాగంగా బీచ్ రోడ్డులో ఉన్న రాడిసన్‌బ్లూ హోటల్లో జిల్లా పర్యాటక శాఖ అధికారులు శనివారం కొమ్మకోయ నృత్యం ఏర్పాటు చేశారు. ఇది పర్యాటకులను విశేషంగా అలరించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పలుచోట్ల ఈ తరహా నృత్యాలు ఏర్పాటు చేసినట్టు టూరిజం ఫోరమ్ అధ్యక్షుడు పవన్ కార్తీక్ తెలిపారు.

మధ్య తరగతి మందహాసం

... 7వ పేజీ తరువాయి

రవాణా సులభతరమవుతుంది.

పర్యాటకంగాను...

దేశంలో ఉపాధికి అపార అవకాశాలు ఉన్న పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తామని ప్రకటించారు. అత్యుత్తమమైన 50 పర్యాటక కేంద్రాల అభివృద్ధికి నిధులు ఇస్తామన్నారు. ఆయా కేంద్రాల్లో హోటళ్లు, డెస్టినేషన్ సెంటర్ల నిర్మాణానికి సహాయం చేస్తారు. విశాఖపట్నం, అరకులోయ ఈ కోవలోకి వస్తాయి. నిధులు వచ్చే అవకాశం ఉంది.

224 కిలోల గంజాయి పట్టివేత

సబ్బవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారిలోని మర్రిపాలెం టోల్ గేటు వద్ద 224 కిలోల గంజాయిని సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఐదుగుర్ని అరెస్టు చేయడంతో పాటు ఓ వ్యాన్, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ తెలిపిన వివరాలి. ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు ఓ వ్యాన్‌లో గంజాయి తరలిస్తున్నట్టు సీఐ రమణకు శనివారం ముందస్తు సమాచారం అందింది. ఈ మేరకు సాయంత్రం 4.30గంటలకు మర్రిపాలెం టోల్ గేటు వద్ద ఎస్ఐ పి.సింహాచలం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఇంతలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న వ్యాన్ రావడాన్ని గుర్తించారు. ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేయగా 108 ప్యాకెట్లలో 224 కిలోల గంజాయి పట్టుబడింది. వ్యాన్‌తో పాటు అందులో ఉన్న ఐదుగుర్ని స్టేషన్‌కు తరలించి, విచారించారు. గంజాయిని ఆనందపురం వద్ద లోడ్ చేసి మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు తరలిస్తున్నట్టు వారు వెల్లడించారు. పట్టుబడినగంజాయి విలువ రూ.11.20 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన దూకరి రమణమూర్తి, దుర్గా బాలరాజు, మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన అనిల్ సురేష్, రాహుల్ రాకేష్, సుమిత్ అమిత్ బాటింగేలను అరెస్టు చేశామన్నారు. వ్యాన్ డ్రైవర్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

ఆకలి సూచీలో 106వ స్థానంలో భారత్

- రైతుల ఆత్మహత్యలు.. ఆకలిచావులను పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం: ఎంఏ బేబి
- కేంద్రం హోదా ఇస్తే.. పరిశ్రమలు అవే వస్తాయి: వీఎస్ఆర్
- నెల్లూరులో ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర మహాసభలు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచంలోని 127 దేశాల్లో ఆకలి సూచికలో భారతదేశం 106వ స్థానంలో ఉంది. కడుపు నిండా తిండి పెట్టలేని పరిస్థితి దేశంలో ఉంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి వెల్లడించారు. ఆపార్టీ 27వ రాష్ట్ర మహాసభలు శనివారం నెల్లూరులో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ సభలు జరిగే అనిల్ గార్డెన్స్‌కు సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబి మాట్లాడుతూ.. 'దేశంలో ఆకలి కేకలు వినిపిస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఆర్థికవేత్తలు ఎన్ని సూచనలు చేసినా కేంద్రం తగిన విధంగా స్పందించకపోవటంతో గిరిజనులు, వెనుకబడిన వర్గాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో 1,00,474 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతి 24 గంటలకు 34 మంది రైతులు, కూలీలు ఆత్మహత్య చేసుకుంటుంటే బీజేపీ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పూర్తిగా ముస్లింలు ఉన్న నియోజకవర్గాల్లో బీజేపీ గెలవడానికి కారణం... కొన్ని ప్రాంతాల్లో ముస్లిం ఓటర్లను ఓట్లు వేయకుండా భయపెట్టింది. మరికొన్ని చోట్ల భయపెట్టి ఓట్లు వేయించుకుంది. వామపక్ష నేతలు అధికారంలో ఉన్న దేశాల్లో ఎన్నో సంస్కరణలు జరుగుతున్నాయి. ఆయా దేశాలను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది' అని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.... 'బీజేపీ, మతతత్వాన్ని రెచ్చగొట్టి మతాల మధ్య చిచ్చు పెడుతోంది. ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఏపీకి ఇప్పటివరకు రూ.3 లక్షల కోట్ల నిధులు ఇచ్చినట్లు ప్రకటించారు. ఆ నిధులు ఏమయ్యాయో సీఎం చంద్రబాబు స్పష్టం చేయాలి. ఈ నిధులే వచ్చి ఉంటే రాష్ట్రంలో టీడీపీ ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు రూ.20 వేలు ఇవ్వవచ్చు కదా? అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీ కూడా అమలు చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'దావోస్ వెళ్లి పారిశ్రామికవేత్తలను కలిసి పరిశ్రమలు తెవడానికి కృషి చేస్తున్నట్లు చంద్రబాబు చెబుతున్నారు. అదే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే పరిశ్రమలు వాటంతట అవే వస్తాయన్న విషయాన్ని ఆయన గుర్తించాలి. ప్రత్యేక హోదాపై ఒత్తిడి చేయాలి' అని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, పుణ్యవతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రారంభం సందర్భంగా పతాకావిష్కరణ చేస్తున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబి, బీవీ రాఘవులు, ఆ పార్టీ నేతలు వి.శ్రీనివాసరావు, గఫూర్, మధు, బాబూరావు


పీవీ నరసింహమూర్తి దంపతులను సన్మానం చేస్తున్న సహకార బ్యాంకు డైరెక్టర్లు, ఉద్యోగులు

సహకార బ్యాంకుల్లో విధి నిర్వహణ గౌరవంగా భావించాలి

▸ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ సీఈవో నరసింహమూర్తి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : సహకార బ్యాంకుల్లో పని చేయడాన్ని ప్రతి ఉద్యోగి గౌరవంగా భావించాలని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ (వీసీబీ) సీఈవో పీవీ నరసింహమూర్తి పేర్కొన్నారు. వీసీబీ సీఈవోగా నరసింహరావు పదవీ విరమణ పొందిన సందర్భంగా శనివారం మద్దిలపాలెంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సహకార రంగం మెరుగైన సమాజానికి దోహదపడుతుందన్నారు. సహకార బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులు అంకితభావంతో పని చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని వృత్తిలో రాణించాలన్నారు. వీసీబీ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, డైరెక్టర్లు, ఉద్యోగుల సహకారంతో సమర్థవంతమైన సేవలు అందించగలిగానన్నారు. వీసీబీ పూర్వ చైర్మన్ మానం అంజనేయులు మాట్లాడుతూ నరసింహమూర్తి బ్యాంక్ డైరెక్టర్‌గా మున్ముందు సేవలు అందించాలన్నారు.పేదలు, సామాన్యులు డిపాజిటర్లుగా ఉన్న కో-ఆపరేటివ్ బ్యాంకుల అభివృద్ధికి పాలకమండలి పటిష్టంగా పని చేయాలన్నారు. అనంతరం పీవీ నరసింహమూర్తి దంపతులకు బ్యాంకు ఉద్యోగులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో వీసీబీ డైరెక్టర్లు ఏజే స్టాలిన్, జేవీ సత్యనారాయణమూర్తి, ఆదినారాయణ శాస్త్రి, నాగభూషణ చౌదరి, జి.జనార్దనరావు, ఎస్.కామరాజు, కె.ప్రసాదరావు, డి.బాబూరావు, వివిధ శాఖల వీసీబీ బ్రాంచ్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా మద్దిల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా బొట్ట సురేష్, ఉపాధ్యక్షులుగా బొట్ట సురేష్ కుమార్, కొయ్య శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా వీడీఎం గిరి, కన్వీనర్‌గా మద్దిల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా మద్ది శివ, ఆవాల రామకృష్ణ ఎన్నికయ్యారు. వీరికి సభ్యులు ఘనంగా సత్కరించారు. మరో 25 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఇసుకతో పాటు ఇతర సరకుల రవాణాలో లారీ యజమానులు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది. ఆనందపురం మీదుగా ఉదయం 8గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ నగరంలోని నో ఎంట్రీ జోన్ పెట్టడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా ఉన్నతాధికారులతో సమస్య పరిష్కారానికి చర్చిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సభ్యులు హాజరయ్యారు.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల పంపిణీ

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఇసుకతోటలోని ఉమానగర్‌కు చెందిన మామేని సుశీలకు రూ.1,59,790లు, తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ ఎస్సీ ఎస్టీ కాలనీకి చెందిన ఇనపసప్పుల సుగుణకు రూ.2,70,400కు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలను అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బోర ధనరెడ్డి, బైరెడ్డి పోతనరెడ్డి, అక్కరబోయిన రాంబాబు, చెల్లుబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన

▸ వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి
▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు జగన్ హయాంలో రాష్ట్రం అన్నివిధాలా నష్టపోయిందన్నారు. దీంతో అటు పాలన, ఇటు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన ఏడు నెలల్లోనే రూ.ఆరు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులన్ని గతంలో తమ హయాంలో చేసుకున్న ఒప్పందాల మేరకేనని వైసీపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. జగన్ పాలన నచ్చకే ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని పాతాళానికి తొక్కేశారని వ్యాఖ్యానించారు. జగన్ పాలనతో రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుందని, ప్రతి నెలా రూ.71 వేల కోట్ల అప్పులకే ఇప్పుడు కట్టాల్సి వస్తుందని గండి బాబ్జీ పేర్కొన్నారు. వైసీపీ నాయకుల వ్యాఖ్యానాలను ప్రజలంతా గమనిస్తున్నారని, అందువల్ల వారంతా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ప్రస్తుత మాదిరిగానే భవిష్యత్తులోనూ వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందన్నారు. సీఎంగా ఉన్నప్పుడు జగన్ రూ.19,870 కోట్లను విలాసాలకే వెచ్చించారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ చొరవ వల్లే స్టీల్‌ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీని ప్రకటించిందన్నారు. రాష్ట్రానికి పలు పరిశ్రమలు వస్తున్నాయని, వాటి ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పన్నుల రూపంలో ఆదాయం సమకూరనున్నదని బాబ్జి అన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గొంప సత్యనారాయణ పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ పరిమితి 62 ఏళ్లకు కొనసాగించాలి

జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

సిరిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలకు కొనసాగింపు జరిగేలాఅమలు చేయాలని, ఈ విషయమై స్టాండింగ్ కమిటీలో అజెండాగా పెట్టిచర్చించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు 60 ఏళ్లకు రిటైర్‌మెంట్ వయసును కుదిస్తూ జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం సరికాదన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేకుండానే 210 మందిని విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, యు.రాజు మాట్లాడుతూ పారిశుధ్యం, నీటి సరఫరా ఇంజనీరింగ్ విభాగంలో 7,500 మందిని కొనసాగించేందుకు అప్కాస్ అభ్యంతరం లేదని, పర్మినెంట్ ఉద్యోగులకు 62 సంవత్సరాలు రిటైర్‌మెంట్ వయసును పెంచినప్పుడు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు అదే విధానాన్ని పాటించాలని కోరారు. ఈ ధర్నాలో సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

▸ కొట్టి చంపారంటూ తల్లిదండ్రులు ఆరోపణ



గాజువాక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక సమీపం శ్రీనగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం ఫూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన జి.భాస్కరరావు (24) శ్రీనగర్‌లో అద్దెకు నివాసం ఉంటూ ఫార్మాసిటీలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం భాస్కరరావు తమ పక్క ఇంట్లో ఉంటున్న ఓ యువతి స్నానం చేస్తుండగా వీడియో తీశాడు. ఈ విషయం తెలిసి ఆ యువతి తల్లిదండ్రులు నిలదీయడంతో పాటు భాస్కరరావు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు విజయనగరం నుంచి ఇక్కడకు వచ్చారు. అయితే అప్పటికే ఫ్యాన్ హుక్‌కు భాస్కరరావు ఉరి వేసుకుని మృతి చెందాడు. అయితే భాస్కరరావు ఆత్మహత్య చేసుకోలేదని, కొట్టడం వల్లే మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. భాస్కరరావు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో యువతితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

12వ వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆరిలోవ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో లో-వోల్టేజీ సమస్య తీరనుంది. ఇక్కడి సమస్యను స్థానికులు టీడీపీ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవ తీసుకొని ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుకు కృషి చేశారు. విద్యుత్ అధికారులు శనివారం ఈ ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి : సీపీఐ

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి ఎం. పైడిరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఆనందరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు లేక అనేక మంది పేదలు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు.

రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగు

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేప థ్యంలో అధికారులు పలు రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు శనివారం ముసుగు వేశారు. పద్మనాభం, రెడ్డిపల్లి, మద్ది, అనంతవరం, చిన్నాపురం, రేవిడి, అయినాడ గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించారు.

ఆర్టీసీలో సేవల నాణ్యత పెంచాలి

విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు


డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎం అప్పలనాయుడు, పీవో తిరుపతి తదితరులు

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో సేవల నాణ్యత పెంచాలని, ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూపర్‌వైజర్లకు విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు సూచించారు. ఆర్టీసీ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 వార్షిక డైరీని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు, కాంప్లెక్స్‌లను పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బందిని మరింత అప్రమత్తంగా ఉంచాలన్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా బస్సులు నడిపేందుకు సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశాఖ రీజియన్ పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీధర్, రాజు, మాధురి, నాయుడు, ఉజ్వల, హిమబిందు మోహనరావు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి మరో ప్రతిష్టాత్మక అవార్డు

ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రోగులకు అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నందుకు గాను మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించినట్టు ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం హోటల్ మేఘాలయలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇండియా (ఏహెచ్‌పీఐ) పేషెంట్ సెంట్రిక్ విభాగంలో ఈ అవార్డును అందించినట్టు పేర్కొన్నారు. రోగి సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు రిస్క్ మేనేజ్‌మెంట్, రోగి సంతృప్తి, వ్యాధి పట్ల రోగికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించడం, చికిత్స వివరాలను తెలియజేయడం, పేషెంట్ కోలుకున్న ఫలితం వంటి అంశాలను పరిశీలించి ఈ అవార్డు అందించినట్టు ఆయన తెలిపారు.

నూతన వైద్య విధానాలపై వైద్యులకు అవగాహన అవసరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో వస్తున్న అధునాతన వైద్య విధానాలపై వైద్యులు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అవకాశం ఉంటుందని ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, కేజీహెచ్‌లోని ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహిస్తున్న ఆర్థోపెడిక్ సర్జన్ల సదస్సు మూడో రోజైన శనివారం కొనసాగింది. ఇందులో భాగంగా డాక్టర్ జి.నరసింహారెడ్డి స్మారక ప్రసంగాన్ని సోలాపూర్‌కు చెందిన డాక్టర్ శివశంకర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకల వైద్య విభాగానికి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో నూతన విధానాలు, అనుసరిస్తున్న పద్ధతులను వివరించారు. మరో వైద్య నిపుణుడు డాక్టర్ యగ్రీశ్వరుడు స్మారకార్థం ఉపన్యాసంలో గంగా ఆస్పత్రి చైర్మన్, ప్రముఖ ఎముకల వైద్యుడు డాక్టర్ రాజశేఖరన్ మాట్లాడుతూ ఈ తరహా సదస్సులు, లైవ్ సర్జరీలతో పీజీ విద్యార్థులకు, యువ వైద్యులకు మేలు కార్యక్రమంలో చేకూరుతుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు అన్యాయం

▸ రైల్వేస్టేషన్ ఎదుట సీపీఐ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోఉత్తరాంధ్రకు అన్యాయం చేశారంటూ సీపీఐ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులను విస్మరించారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఆరోపించారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటన చేయడం, జోనల్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ రైల్వే జోన్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు జరపకపోవడం దారుణ మని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంటుకు అరకొరగా నిధులు కేటాయించడం ఉత్త రాంధ్రకు అన్యాయం చేయడమేనన్నారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని లేదా సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రకటించక పోవడం శోచనీయమన్నారు. సామాన్యులకు అన్యాయం చేస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. త్వరలో బిహార్‌లో ఎన్నికలు జరగనున్నందున రాజకీయ లబ్ధి కోసం ఆ రాష్ట్ర ప్రజలకు ఊరట కలిగేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు ఎస్‌కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, ఆర్.శ్రీనివాసరావు, జి.కాసులరెడ్డి, బి.పుష్ప, కె.రాధ, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన తోపుడుబండ్ల వివాదం

▸ స్టేటస్ కో ఆదేశాలు ఉన్నప్పటికీ దుకాణాల తరలింపునకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది యత్నం
▸ ఇరు వర్గాల మధ్య వాగ్వాదం ▸ కోర్టు ఉత్తర్వులు చూపడంతో వెనక్కు తగ్గిన అధికారులు


జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి కోర్టు ఆర్డర్ చూపిస్తున్న న్యాయవాది శ్రీరామమూర్తి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు కళాభారతి రోడ్డులో తోపుడు బండ్ల వివాదం మళ్లీ మొదలైంది. శనివారం సాయంత్రం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు బండ్లు తొలగించే ప్రయత్నం చేయగా, చిరువ్యాపారులు ఆందోళనకు దిగారు. జిల్లా కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుంటే తోపుడు బండ్లు ఎందుకు తొలగిస్తారంటూ వ్యాపారులు ప్రశ్నించారు. అయినా వినకుండా సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు ట్రాలర్ జీప్‌లో తోపుడు బండ్లు తరలించే ప్రయత్నం చేశారు. దీంతో చిరు వ్యాపారుల తరపున కోర్టులో కేసు వేసిన న్యాయవాది పి.శ్రీరామమూర్తి సంఘటన స్థలానికి చేరుకున్నారు. కళాభారతి రోడ్డులో ముప్పై ఏళ్లుగా ఉన్న తోపుడు బండ్లు ఎలా తొలగిస్తారంటూ వాదించారు. స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తి వేసిన కేసుకు చిరువ్యాపారాలు తొలగించాలని హైకోర్టు ఆదేశించిందని, కోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని అధికారులు చెప్పుకొచ్చారు. అధికారుల మాటలకు న్యాయవాది ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ వేసిన కేసుకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు డిస్మిస్ అయిపోయాయని, జిల్లా కోర్టును చిరువ్యాపారులు ఆశ్రయించగా స్టేటస్ కో ఇచ్చిందని వివరించారు. అందుకు సంబంధించిన ఆర్డర్ కాపీలను అధికారులకు చూపించారు. జీవీఎంసీ కమిషనర్, పోలీస్ కమిషనర్, ఎంవీపీ కాలనీ సీఐలపై కోర్టు ధిక్కరణ కేసు కూడా ఈ రోజుతో ముగిసిందని వివరించి అందుకు సంబంధించిన కాపీలను చూపించడంతో అధికారులు వెనుదిరిగారు.

జీవీఎంసీ 22వ వార్డులో దుకాణాలు తొలగించాలని గత ఏడాది కార్పొరేటర్ పీతల మూర్తి హైకోర్టును ఆశ్రయించగా తొలగించాలని కోర్టు ఆదేశాలిచ్చింది. కోర్టు ఆదేశాలతో నవంబర్ 16న వార్డులోని దుకాణాలన్నీ జీవీఎంసీ అధికారులు తొలిగించడం అప్పట్లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాదాపు 75 రోజులు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడిన చిరువ్యాపారులు సాయంత్రం తోపుడు బండ్లు పెట్టగానే జీవీఎంసీ అధికారులు తొలగించే ప్రయత్నం చేయడం వివాదమైంది.

వీఎంఆర్డీఏలో తాత్కాలికంగా ప్రజాదర్బార్ రద్దు

సిరిపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మెల్సీ (గ్రాడ్యుయేట్) ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోని ఉన్నందున ప్రతి సోమవారం వీఎంఆర్డీఏలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ ఈ నెల 3న నిర్వహించడం లేదని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. తిరిగి మార్చి 10న నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

పరీక్షల తేదీలు ఖరారు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో వాయిదా పడిన పరీక్షలను నిర్వహించేందుకు అధికారులు రీ షెడ్యూల్‌ను విడుదల చేశారు. గత నెల ఎనిమిదో తేదీన జరగాల్సిన రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల తేదీలను ఖరారు చేస్తూ ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఒక ప్రకటనను విడుదల చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్ హానర్స్ రెగ్యులర్ అండ్ సప్లిమెంటరీ విద్యార్థులకు ఈ నెల నాలుగో తేదీన ఉదయం9 గంటలు నుంచి 10.30 గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తారు. అలాగే మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ విద్యార్థులకు నాలుగో తేదీ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల మధ్య పరీక్ష జరగనున్నది. మూడో సెమిస్టర్‌లో మళ్లీ చేరిన (రీ అడ్మిటెడ్) విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. గతంలో కేటాయించిన సెంటర్లలోనే ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

వాహన దహనానికి యత్నం

మహారాణిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : బీచ్‌రోడ్డులో అర్ధరాత్రి ఓ దుండగుడు మొబైల్ ఫుడ్ వాహనాన్ని దహనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు గుర్తించి కాపాడారు. వైఎంసీఏ వద్ద నిలిపి ఉంచిన మొబైల్ ఫుడ్ వెహికల్‌ను శనివారం వేకువ జామున గుర్తు తెలియని వ్యక్తి దహనం చేసేందుకు యత్నించాడు. అంతలోనే అక్కడకు పోలీసులు వస్తుండడం గమనించి పరారయ్యాడు. మంటలు వ్యాపిస్తుండడంతో గుర్తించిన పోలీసులు వెంటనే అగ్నిమాపక వాహనాన్ని పిలిపించారు. వాహన యజమాని సతీశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంటర్‌ప్రెన్యూర్స్ సమావేశం

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో శనివారం ఎంటర్‌ప్రెన్యూర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 500 మంది వరకు స్టార్టప్ వ్యవస్థాపకులు, ఎంటర్‌ప్రెన్యూర్స్, ఇన్వెస్టర్స్, ఎంఎస్‌ఎంఈ ప్రతినిధులు, విద్యార్థులు, పలు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ ఎం.సమీర్ జావెద్ పలు అంశాలను వివరించారు. పీర్ క్యాపిటల్ మేనేజింగ్ పార్టనర్ కార్తిక్ ప్రభాకర్, ఫాబ్ మార్ట్ అండ్ ఇండియా ప్లాసా ఫౌండర్ కె.వైతీశ్వరన్‌తో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు, ఎంటర్ ప్రెన్యూర్స్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మదగజరాజ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **మహిష :** రమాదేవి
● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య మోహిని కాంప్లెక్స్ శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 29, టమాటా 12, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 36, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)44, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీర దోస 32, కాప్సికమ్38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 24, గోరు చిక్కుడు 26, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

వాల్తేరు డివిజన్‌కు ఆరు విశిష్ట రైల్ సేవా పురస్కారాలు



పురస్కారాలు పొందిన వారితో డీఆర్‌ఎం సాహు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే 68వ రైల్వే వారోత్సవాల్లో వాల్తేరు డివిజన్‌కు ఆరు విశిష్ట సేవా పురస్కారాలు లభించాయి. లక్ష్యాలకు చేరుకోవడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆరు శాఖల అధికారులు ఈ అవార్డులు అందుకున్నారు. కమర్షియల్ శాఖ, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, సెక్యూరిటీ బ్రాంచ్, స్టోర్సు డిపో, ట్రాక్ మిషన్ డిపో, మెడికల్ బ్రాంచిల అధికారులు డీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహుతో కలిసి తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ నుంచి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఉద్యోగుల అంకితభావం, నిబద్ధత, చిత్తశుద్ధికి ఈ పురస్కారాలు నిదర్శనంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

పద్మశాలి కమ్యూనిటీ భవనం నిర్మాణం


మార్కండేయ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, పద్మశాలి సంఘం నాయకులు

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణం చేపడతామని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శనివారం మార్కండేయ జయంతిని పురస్కరించుకుని బురుజుపేట శివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభ్యర్థన మేరకు ఆర్‌ఓ ప్లాంట్ సమకూరుస్తామన్నారు. హోమం, అమ్మవారి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. కొప్పుల రామ్‌కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కూటమి నాయకులు పప్పు రాజారావు, ఆధ్యాత్మిక వేత్త రాజశేఖర్, భక్త మార్కండేయ ట్రస్ట్ సభ్యులు, పద్మశాలి ఆత్మీయ సేవా సంఘం సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

‘భూ సమస్యలకు పరిష్కారం చూపిన ప్రభుత్వం’

సీతంపేట (డాబాగార్డెన్స్), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలోని మహారాణిపేట, వెంకటేశ్వరమెట్ట, ఎల్లమ్మతోట, పుతివారిమాన్యం, అస్సాంగార్డెన్స్, అంగటిదిబ్బ, కనకమహాలక్ష్మీ గుడి ప్రాంతాల్లోని భూ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం సీతంపేట జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్, ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రానున్నాయన్నారు. కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా, పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ఎస్.శివశంకర్ మాట్లాడుతూ 610 ఎకరాలను సింహాచలం దేవస్థానానికి కేటాయించడం ద్వారా ఏన్నో ఏళ్లుగా ఉన్న పంచగ్రామాల సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపిందన్నారు. విశాఖ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్‌లు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని మరోసారి చెబుతున్నామన్నారు.

కుంభమేళా ప్రత్యేక రైలుకు విశేష ఆదరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న విశాఖ నుంచి గోరఖ్‌పూర్‌కు ప్రవేశపెట్టిన 08588 నంబరు గల ప్రత్యేక రైలుకు శనివారం ఉదయం రిజర్వేషన్ బెర్తులు విడుదల చేసిన గంటలోనే అన్ని క్లాసులు నిండిపోయి నిరీక్షణ జాబితాకు చేరింది. కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేందుకు విశాఖ నుంచి శాశ్వత ప్రాతిపదికన నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు ప్రత్యేక రైళ్లకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. విశాఖ-గోరఖ్‌పూర్ మధ్య ఒక ట్రిప్పు (రాను పోను) మాత్రమే అందుబాటులో ఈ రైలులో బెర్తులు నిండిపోయాయి. భువనేశ్వర్ నుంచి అనుసంధాన రైళ్ల ద్వారా ప్రయోగ్ చేరేందుకు ప్రయత్నించిన ప్రయాణికులకు బెర్తులు లభించక నిరాశ ఎదురైంది. దీంతో కుంభమేళాకు వెళ్లాలని ఆసక్తితో ఉన్నవారు మరిన్ని ప్రత్యేక రైళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 4న విశాఖ నుంచి గోరఖ్‌పూర్‌కు (08588) ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు మీడియా ద్వారా ప్రకటన వచ్చిన వెంటనే ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. ఈ రైలుకు రిజర్వేషన్ సదుపాయం శనివారం ఉదయం అందుబాటులోకి రావడంతో అప్పటికే ఇంటర్‌నెట్ ముందు కూర్చొని సిద్ధంగా ఉన్నవారు ఆగమేఘాలపై తమ వివరాలను నింపి టికెట్లు పొందారు. బృందాలుగా వెళ్లేందుకు సిద్ధమైన కొందరు ఉదయం ఎనిమిది గంటలకే రైల్వే రిజర్వేషన్ కార్యాలయానికి చేరుకుని టికెట్ పొందే ప్రయత్నాలు చేశారు. దీంతో గంటలోనే బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది. ప్రత్యేక రైలు కేవలం ఒక ట్రిప్పుకు మాత్రమే పరిమితం చేయడంతో బెర్తులు లభించనివారు నిరాశ చెందారు.

కళలపై మక్కువ చూపడం శుభపరిణామం



కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఇతర కళాకారులు

డాబాగార్డెన్స్ ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తమలో దాగి ఉన్న ప్రతిభను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు.మెలోడి క్రియేటర్స్ ఆధ్వర్యంలో 'నాదం నీ దీవెన' సలాది సత్యశ్రీ సినీ సంగీత విభావరిని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య జీఎస్ఎన్ రాజు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళలపై యువత మక్కువ చూపడం మంచి పరిణామమన్నారు. గాయత్రి సత్యశ్రీని ప్రశంసించారు. గాయకులు ఆలపించిన గేయాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్, ప్రోగ్రాం కన్వీనర్ కె.వీరస్వామి సారథ్యం వహించారు. గాయకులు వంకాయల సన్యాసిరాజు, ఉషా చీరాల, కొణతాల రాజు, ఎం.మస్తాన్‌రెడ్డి, నాంచారయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌పాండర్లు అమర్చకపోతే ఫిషింగ్ బోట్ రిజిస్ట్రేషన్ రద్దు

మహారాణిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మెకనైజ్‌డు ఫిషింగ్ బోట్లకు ట్రాన్స్‌పాండర్లు అమర్చుకోవాలని విశాఖ మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు ఒక ప్రకటనలో సూచించారు. ప్రధాన మంత్రి మత్స్య యోజనలో భాగంగా మొదటి దశలో సముద్రంలో చేపల వేట చేస్తున్నప్పుడు బోటుస్థానాన్ని గుర్తించే సమాచారం తెలుసుకునేందుకు వంద శాతం సబ్సిడీపై ట్రాన్స్‌పాండర్లను మత్స్యశాఖ సరఫరా చేయనున్నట్టు తెలిపారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో ఇప్పటి వరకు 586 మెకనైజ్డ్ బోట్లకు ట్రాన్స్‌పాండర్లు అమర్చామని, మిగతా బోట్ల యజమానులు ఈ నెల 7లోగా అమర్చకుంటే రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

‘పాఠశాల విద్య ప్రస్తావన లేకపోవడం బాధాకరం’

మద్రిపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య ప్రస్తుత స్థితిగతుల గురించిగాని, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్య సాధనకు అవసరమైన అంశాలపై బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేకపోవడం బాధాకరమని విశాఖ జిల్లా ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఏఎస్‌నాయుడు అన్నారు. వచ్చే అయిదేళ్లలో 50 వేల ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ రింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా, అందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకంపై స్పష్టత లేదన్నారు. జాతీయ విద్యావిధానం అమలు గురించి శుక్రవారం రాష్ట్రపతి ప్రసంగంలో గొప్పగా పేర్కొన్నా బడ్జెట్‌లో కేవలం 2.5 శాతం కేటాయించారు. బడ్జెట్‌లో కనీసం 6శాతం విద్యకు కేటాయించాలని కొఠారి కమిషన్ ఏనాడో చెప్పినా, అందుకు అనుగుణంగా కేటాయింపులు లేకపోవడం అసంతృప్తి కలిగించిందన్నారు. విధిగా కొత్త పన్ను విధానాన్ని అనుసరించవలసి రావడం బాధాకరమన్నారు.

ద్రోణంరాజు శ్రీనివాస్ సేవలు అమూల్యం: గుడివాడ అమర్‌నాథ్

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి ద్రోణంరాజు శ్రీనివాస్ అందించిన సేవలు మరపురానివని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం ద్రోణంరాజు శ్రీనివాస్ జయంతి సందర్భంగా వన్‌టౌన్ స్వామి వివేకానంద సేవా సంఘం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరం, అన్న వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజకీయాల్లో ద్రోణంరాజు శ్రీనివాస్ నిబద్ధతతో పనిచేశారని, వైసీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అమర్‌నాథ్ కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఆయన తనయుడు శ్రీవాత్సవ తండ్రికి ఘననివాళి అర్పించినట్లయిందన్నారు. శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో వివేకానంద సేవా సంఘం నిర్వహించిన ఉచిత



ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుడివాడ అమర్‌నాథ్ మేయర్ హరి వెంకటకుమారి, ద్రోణంరాజు శ్రీవాత్సవ తదితరులు

కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం పార్టీ నాయకులు అన్న వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ హరివెంకటకుమారి, పేడాడ రమణకుమారి, వాసుపల్లి గణేశ్‌కుమార్, బెహరా భాస్కరరావు, వంకాయల తాతాజీ, వివేకానంద సంస్థ ప్రతినిధి సూరాడ అప్పారావు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

ఎండాడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడ్ని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్, సైబర్ క్రైం పోలీసులు ఇటీవల సంయుక్తంగా పెదవాల్తేరులోని గాయత్రి టవర్స్‌లో దాడి చేసి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. ఇందులో ప్రధాన సూత్రదారిగా భావిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరిన్ని అరెస్టులు చేయాల్సి ఉండడంతో పోలీసులు ప్రధాన నిందితుడి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు.

బైక్ బోల్తా పడి దివీస్ ఉద్యోగి మృతి

భీమునిపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్ ఎర్రమట్టి దిబ్బల సమీపంలో శుక్రవారం రాత్రి బైక్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పాడ దివీస్ వసతి గృహం నుంచి ముమ్మాని ప్రదీప్ (28), కె. లోకేశ్ శుక్రవారం బైక్‌పై నగరానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ఐఎన్ఎస్ కళింగ దాటిన తరువాత మార్లిన్ కే రెస్టారెంట్ సమీపంలో ఉన్న మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటన రాత్రి 10.30 సమయంలో జరగ్గా పోలీసులకు అర్ధరాత్రి సమాచారం అందింది. వెంటనే వారు 108 వాహనంలో బాధితులను కేజీహెచ్‌కు తరలించారు. మార్గంమధ్యలో ప్రదీప్ మృతి చెందగా, లోకేశ్ చికిత్స పొందుతున్నాడు. అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. మృతుడు విజయనగరం జిల్లా ఎల్.కోట మండల వాసి అని, అవివాహితుడని పోలీసులు చెప్పారు. వారిద్దరూ దివీస్ కంపెనీలో పనిచేస్తున్నారన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇద్దరూ హెల్మెట్ ధరించలేదని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఎస్ఐ హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో ఆత్మహత్యకు యత్నం.. కాపాడిన లైఫ్‌గార్డులు

మహారాణిపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఉన్న తనకు ఇంట్లో కొడుకుతో గొడవ జరగడంతో బీచ్‌లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని ప్రాణరక్షణ సిబ్బంది (లైఫ్‌గార్డులు) కాపాడారు. ఎస్‌పీడీ ప్రాంతానికి చెందిన నున్న చిట్టిబాబు (72) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో కొడుకుతో గొడవ జరిగింది. మనసు విరక్తిచెందిన చిట్టిబాబు ఆర్‌కేబీచ్ సమీపంలోని మత్స్యదర్శిని ఎదురుగా ఉన్న సముద్రంలో ఆత్మహత్యకు ప్రయత్నించారు. అది గమనించిన ప్రాణరక్షణ సిబ్బంది ఆనంద్ ధనరాజు, అరవింద్ పోలిరాజ్‌లు వెంటనే అతనికి సీఆర్‌పీ చేసి


చిట్టిబాబును కాపాడుతున్న ప్రాణరక్షణ సిబ్బంది

అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించి ప్రాణాల్ని కాపాడారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల అరెస్ట్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకున్నట్లు పోలీసు అధికారులు శనివారం తెలిపారు. నగరంలోని సాయి బాలుర హాస్టల్ గది తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి రూ.1.7 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు దొంగతనం చేశారని చెప్పారు. బాధితుడు ములపర్తి రాకేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు తమిళనాడు రాష్ట్రం వెల్లూరుకు చెందిన మోహన్ చిన్నన్నాన్ (28), చిత్తూరు జిల్లా రామకుప్పం చండిగానిపల్లికి చెందిన కార్తీక్ పెరుమాళ్ (28)ను పట్టుకున్నట్లు చెప్పారు. ద్వారకా సబ్ డివిజన్ సీఐ పర్యవేక్షణలో క్రైమ్ ఎస్సై ఎస్.రాజు, పీసీ వి.అప్పలరాజు, ఎన్. అప్పలరాజు, వి.అప్పలనాయుడు బృందాలుగా విడిపోయి నేరం జరిగిన 24 గంటల్లో చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కోసం విశాఖపట్నం జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. ద్వారకా క్రైమ్ పోలీసులను డీసీపీ, క్రైం ఏసీపీ అభినందించారు.

భారీగా గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ. 2.9 లక్షల విలువ చేసే 58 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒడిశాకు చెందిన ప్రసన్నరాజ్ కిషోర్ బలియారసింగ్, రాహుల్ పాని, పింటు దాస్ అనే ముగ్గురు రైల్లో ముంబయికి రవాణా చేస్తూ దొరికిపోయారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని రైల్వే పోలీసులు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతిలో తల్లిదండ్రుల బాధ్యత కీలకం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులను చదివించడంలో తల్లిదండ్రుల బాధ్యత కీలకమని సీతమ్మధార మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవోలు) రామారావు, బాలామణి సూచించారు. గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన ఎంఈవోలు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, గౌరవంతో నడుచుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి చదువుపై ధ్యాసపెడితే బాగుపడతారన్నారు. తమ పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ఓ కన్నేసి, ఉపాధ్యాయులను కలిసి తెలుసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ


మాట్లాడుతున్న ఎంఈవో రామారావు

నరస మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 122 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. నిరుటికన్నా ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పాఠశాల యాజమాన్య సంఘం చైర్మన్ వంగల అప్పలరాజు, ఉపాధ్యాయులు నిర్మల, లలిత, జ్యోతి, రామలక్ష్మి, ఎ.సునంద్, ధర్మారావు, ఎంఎస్‌వీ విశ్వనాథం పాల్గొన్నారు.

కరాటేకు మరింత ప్రోత్సాహం అవసరం: సుమన్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మహిర షొటోకాన్ కరాటే డో ఇండియా నిర్వహిస్తున్న ఎనిమిదో ఆల్ స్టైల్స్ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీలకు సినీ నటుడు సుమన్ తల్వార్, ప్రభుత్వ విప్ గణబాబు కుమారుడు మౌర్య సింహ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సుమన్ మాట్లాడుతూ కరాటేకు ఆదరణ పెరుగుతున్నందున తగిన ప్రోత్సాహం అందాల్సి ఉందన్నారు. సాధన చేస్తున్న క్రీడాకారులకు అన్ని స్టైల్స్‌పై అవగాహన ఉండాలని, కోచ్‌లు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో మారుతున్న నైపుణ్యాలను అభ్యసించి ఔత్సాహికులను తీర్చిదిద్దాలని సూచించారు. మౌర్య వంశీ మాట్లాడుతూ యువత, చిన్నారులు,


కరాటే చాంపియన్‌షిప్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సినీనటుడు సుమన్ తదితరులు

మహిళలు కూడా కరాటే అభ్యసిస్తున్నారన్నారు. నిర్వాహకులు షాబుద్దీన్, అలీ మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ టోర్నీలో ఆతిథ్య భారత్‌తోపాటు శ్రీలంక, భూటాన్, మలేషియా, ఇంగ్లండ్‌ల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నీలో ఫైనల్స్‌కు చేరిన పలువురు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ సెంటర్‌లో 18వ సీఎంఆర్ అయిస్టా సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ శనివారం సింగిల్స్, డబుల్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. సింగిల్స్ 35 ప్లస్ విభాగంలో విజయానంద్ 2-1 సెట్లతో ఈశ్వర్ సాయిపై, కన్నసేతు 2-1 సెట్లతో నితిష్ జాక్సన్‌పై, 55 ప్లస్ విభాగంలో మణికన్నన్ 2-0 స్కోరుతో రావత్‌పై గెలుపొంది ఫైనల్స్‌కు చేరారు. 65 ప్లస్


విజేతలు బాబ్జి, ఎంవిఎల్ఎన్.రాజు

విభాగంలో వి.శ్రీనివాసరెడ్డి, 70 ప్లస్ కేటగిరీలో ఎస్.సేతు విజేతలుగా నిలిచారు. డబుల్స్ 45 ప్లస్ విభాగంలో కె.బాబ్జి-ఎంవీఎల్ఎన్.రాజు 2-0 సెట్లతో రఘురామరాజు-మధుపై విజయం సాధించి ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. ఏయూలో అండర్-12 బాలురలో కార్తిక్ నరసింహ, బాలికల విభాగంలో జి.సురక్ష, అండర్-14 బాలుర విభాగంలో రేవంత్, బాలికల విభాగంలో పరిణిత ఫైనల్స్‌కు చేరారు.

క్రైస్తవుల పాదయాత్ర

జ్ఞానాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథెడ్రల్ చర్చ్ వద్ద శనివారం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ పాదయాత్ర ప్రారంభించారు. వేకువ జామునే వందలాది మంది వేచి ఉన్నారు. గురువుల ప్రార్థనతో పాదయాత్ర మొదలైంది. దారి పొడుగునా స్వచ్ఛంద సంస్థలు పాదయాత్రికులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. జ్ఞానాపురం నుంచి వందల మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రార్థనలు, బైబిల్ పఠనాలతో యాత్ర భక్తి పూర్వకంగా కొనసాగింది. వ్యాకుల


వ్యాకులమాత బొమ్మకు పూలమాలలతో అలంకరణ

మాత పండగ చరిత్రను ప్రాశస్త్యాన్ని భక్తులు స్మరించుకున్నారు. జ్ఞానాపురం నుంచి కొత్తవలస వరకు పాదయాత్ర సాగింది.

మధ్య తరగతి మందహాసం

... 7వ పేజీ తరువాయి

రవాణా సులభతరమవుతుంది.

పర్యాటకంగాను...

దేశంలో ఉపాధికి అపార అవకాశాలు ఉన్న పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తామని ప్రకటించారు. అత్యుత్తమమైన 50 పర్యాటక కేంద్రాల అభివృద్ధికి నిధులు ఇస్తామన్నారు. ఆయా కేంద్రాల్లో హోటళ్లు, డెస్టినేషన్ సెంటర్ల నిర్మాణానికి సహాయం చేస్తారు. విశాఖపట్నం, అరకులోయ ఈ కోవలోకి వస్తాయి. నిధులు వచ్చే అవకాశం ఉంది.

వ్యసనాలతో బతుకులు ఆగం

... 7వ పేజీ తరువాయి

కుటుంబ సభ్యులతో మాట్లాడకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. బెట్టింగ్ అడిక్షన్‌తో బాధపడేవారిలోనూ ఇటువంటి లక్షణాలే ఉంటాయి. అప్పులు చేయడం, పనిపై శ్రద్ధ పెట్టక పోవడం, తప్పుడు మార్గాలను అనుసరించడం, కుటుంబ సభ్యులపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేయడం వంటి లక్షణాలు ఉంటాయి. ఇంట్లో తెలియకుండా భారీగా అప్పులు చేస్తుంటారు.

చికిత్స ఇలా..

ఇటువంటి వ్యసనాలతో బాధపడే వారికి లక్షణాలను బట్టి చికిత్స చేయించాల్సి ఉంటుంది. మందులు, కౌన్సెలింగ్, గ్రూప్, ఫ్యామిలీ థెరపీలతో సాధారణ స్థితికి తీసుకురావచ్చు. వీరి వ్యవహారశైలిని నిశితంగా గమనించడం ద్వారా ప్రాథమిక దశలోనే చాలావరకు సమస్యను గుర్తించేందుకు అవకాశం ఉంది.

అన్ని వయసుల వారిలోనూ..

ఫోన్ అడిక్షన్ తొమ్మిది నుంచి 25 ఏళ్లలోపు వారిలో అధికంగా కనిపిస్తోంది. మద్యం/డ్రగ్స్ వంటి వాటికి బానిసలుగా మారుతున్న వారిలో 20 నుంచి 50 ఏళ్లలోపు వయసువారు ఉంటున్నారు. జూదాలకు అలవాటుపడిన వారిలో 20 నుంచి 40 ఏళ్లలోపువారు అధికంగా ఉంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగాలు చేసే వాళ్లు ఈ తరహా వ్యసనాలకు బానిసలుగా మారుతున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రాథమిక స్థాయిలో గుర్తించడం కీలకం

వ్యసనం స్థాయికి వెళ్లడానికి కొంత సమయం పడుతుంది. కనీసం మూడు నుంచి ఆరు నెలలు సమయంలో అలవాటు వ్యసనంగా మారి అది లేకపోతే ఉండలేని స్థితికి చేరుతుంది. ఈ సమయంలోనే సదరు అలవాట్లను గుర్తించి వాటికి వారిని దూరం చేయడం చాలా సులభం. వ్యసనం నుంచి విముక్తి చేసేందుకు మందులు, కౌన్సెలింగ్ వంటివి ఉన్నాయి. అందుకు వాళ్లు సహకరించే పరిస్థితి కొన్నిసార్లు ఉండదు. ఈ తరహా వ్యసనాలతో బాధపడే వారిలో కొన్ని మానసిక సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ప్రవర్తించే తీరు భిన్న రకాలుగా ఉంటుంది. సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించడం అత్యంత కీలకం.

- డాక్టర్ రామిరెడ్డి, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్

డ్రైవింగ్ పరీక్షకు సర్వర్ బ్రేకులు

... 7వ పేజీ తరువాయి

స్లాట్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిరోజూ డ్రైవింగ్ పరీక్షకు సగటున 200 మంది హాజరవుతున్నారు. శనివారం కూడా సుమారు 200 మందికి పరీక్షల కోసం స్లాట్‌లు కేటాయించారు. చాలామంది ఉదయం పది గంటలకే గంభీరంలోని డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. అధికారులు వారి దరఖాస్తుల వెరిఫికేషన్ చేసిన తర్వాత ట్రాక్ మీద డ్రైవింగ్ పరీక్షకు పంపిద్దామనుకునేసరికి సర్వర్ కనెక్ట్ కాలేదు. దీంతో అభ్యర్థులంతా రెండు గంటలపాటు అక్కడ నిరీక్షించారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే తమ చేతులో ఏమీ లేదని ట్రాక్ పనితీరు పూర్తిగా టెక్నాలజీ ఆధారంగా ఉంటుందని, దీనిని పర్యవేక్షించేవారు కూడా ఢిల్లీలోనే ఉంటారని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వారికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించి సమస్య పరిష్కారించాలంటూ కొందరు అభ్యర్థులు అక్కడున్న అధికారులను కోరారు. శని, ఆదివారాలు ఢిల్లీలో సెలవు దినాలు కావడంతో వారు తమకు అందుబాటులో ఉండరంటూ అధికారులు సమాధానం చెప్పడంతో చాలామంది తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మాతృభాష తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 1: తెలుగు వాళ్లందరూ మాతృభాష తెలుగుకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విద్యార్థులకు మానవత విలువలు, దేశం, తల్లిదండ్రుల పట్ల భక్తి, ప్రేమ ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆయనన్నారు. శ్రీనగర్‌లోని యాపిల్ ఐ స్కూల్‌లో శనివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన ఫ్లోరెసెన్స్-2025 కార్యక్రమాన్ని స్పీకర్‌తో పాటు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, స్కూల్ చైర్మన్ తలశిల బలరామకృష్ణలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తల్లిదండ్రులు టీవీ సీరియల్స్‌కు అతుక్కుపోకుండా దగ్గరుండి పిల్లలను చదివించాలని సూచించారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ విద్యార్థులను ఇతురులతో పోల్చవద్దని, వారిలోని నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ తన జీవితం విద్య అభివృద్ధికే అంకితమన్నారు. కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యను విద్యార్థులకు అందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జయశ్రీ శర్మ, ఎస్.విష్ణువర్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో సేవల నాణ్యత పెంచాలి: ఆర్‌ఎం

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సేవల నాణ్యత పెంచాలని, ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూపర్‌వైజర్లకు విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు సూచించారు. ఆర్టీసీ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 వార్షిక డైరీని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు, కాంప్లెక్స్‌లను పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బందిని మరింత అప్రమత్తంగా ఉంచాలన్నారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా బస్సులు నడిపేందుకు సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ విశాఖ రీజియన్ పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్లు శ్రీధర్, రాజు, మాధురి, నాయుడు, ఉజ్వల, హిమబిందు మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి సంబంధాలు కుదరడం లేదని..

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో దూకి యువకుడి ఆత్మహత్య



శివరామ్ మృతదేహం

గోపాలపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాలు వచ్చినా కుదరక పోతుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాతయ్యపాలెం ప్రాంతానికి చెందిన దేవవరపు శివరామ్ (28) తల్లి రాజేశ్వరి, సోదరుడు హరిరాజుతో కలిసి నివసిస్తున్నాడు. సంతల్లో పలు వస్తువులు విక్రయిస్తూ జీవనోపాధి పొందే శివరామ్‌కు మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదు. ఇటీవల పెళ్లి సంబంధాలు కుదిరినప్పటికీ, ఆ తర్వాత రద్దవుతుండడంతో మనస్తాపానికి గురై ముభావంగా ఉండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చిన శివరామ్ తన సోదరుడికి ఫోన్ చేసి మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు వచ్చానన్నాడు. శివరామ్ మానసిక స్థితి తెలిసి ఆందోళనకు గురైన హరిరాజు తమ బంధువులతో కలిసి రిజర్వాయర్ వద్దకు వచ్చాడు. అక్కడ శివరాజు ద్విచక్ర వాహనాన్ని, సమీపంలో జలాశయం గట్టు వద్ద చెప్పులను గుర్తించారు. సోదరుడు కనిపించకపోవడంతో వెంటనే హరిరాజు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టడంతో శివరామ్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన 'స్టాంప్స్' డీఐజీ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 1: గాజువాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం స్టాంప్స్ అండ్ డ్యూటీ డీఐజీ బాలకృష్ణ సందర్శించారు. శనివారం నుంచి భూముల మార్కెట్ విలువలు పెరగడంతో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇప్పటివరకు కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను డీఐజీకి సబ్ రిజిస్ట్రార్ టి.తారకేశ్ వివరించారు.





పైపు లైన్ పగిలిపోవడంతో పెందుర్తిలోని ప్రధాన రహదారులపై పెద్దఎత్తున ప్రవహిస్తున్న తాగునీరు

పెందుర్తిలో పగిలిన తాటిపూడి పైపు లైన్

- సుమారు 2 గంటల పాటు రహదారులపై ప్రవహించిన తాగునీరు
- ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాలను మళ్లించిన పోలీసులు
- సమస్య పరిష్కారానికి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



పైపు లైన్ పగిలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ హేమవతి

పెందుర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పశు వైద్య కేంద్రం సమీపంలో శనివారం ఉదయం 11.40 గంటల సమయంలో తాటిపూడి పైపు లైన్ పగిలిపోవడంతో ఒక్కసారిగా పెద్దఎత్తున నీరు పైకి ఎగసిపడింది. క్షణాల్లో నీరంతా రహదారులపై ప్రవహించింది పైపు లైన్ పగిలిన ప్రాంతంలో రోడ్డు పెద్ద గొయ్యిలా మారింది. బీఆర్టీఎస్ రహదారి కుడివైపున నీరంతా పెద్దఎత్తున ప్రవహించడంతో అంతా జలమయంగా మారింది. కిలోమీటరు దూరం వరకు రోడ్డుపై నీరు సుమారు రెండు గంటల పాటు వృథాగా పారింది. రోడ్డు పక్కనున్న దుకాణాలు, ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో బీఆర్టీఎస్ కుడివైపు రోడ్డు జలమయమవ్వడంతో ట్రాఫిక్ స్తంభించింది. పెందుర్తి జంక్షన్‌లో వాహనాల రాకపోకలకు అడ్డంకి ఏర్పడడంతో సుమారు గంటసేపు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు స్థానిక కళాశాల వద్ద స్టాపర్ పెట్టి వాహనాలను మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

శాశ్వత నివారణ చర్యలేవి?

నగర ప్రజల దాహార్తిని తీర్చే తాటిపూడి రిజర్వాయర్ పైపు లైన్ పగిలిపోవడంతో దాదాపు రెండు గంటల పాటు తాగునీరు వృథాగా పారుతూ కాలువల్లో కలిసిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న జెడ్సీ హేమవతి సంఘటనా స్థలానికి చేరుకుని పైపులైన్ లీకేజీని పరిశీలించారు. తాటిపూడి రిజర్వాయర్ సమీపం కృష్ణాపురం వద్ద గల వాటర్ ప్లాంటులో మోటార్లను ఆపివేయడంతో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడింది. అనంతరం పగిలిన పైపు లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. గతంలో పలుమార్లు ఈ పైపు లైన్ పగిలినా శాశ్వత నివారణ చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

వేపగుంట: జీవీఎంసీ జోన్-8 పరిధిలో ఉన్న 93, 94, 95, 97, 98 వార్డుల పరిసర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఆదివారం అంతరాయం కలుగుతుందని తాగునీటి సరఫరా విభాగం డీఈ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెందుర్తిలో పైపు లైన్ పగిలినందున 93వ వార్డు పార్ట్ సాయిదుర్గానగర్, దుర్గానగర్, అప్పల నరసింహం కాలనీ, లక్ష్మీపురం, పోర్టుకాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకులం కాలనీ, రెల్లి వీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లిపాలెం, ఎల్‌బీసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత ఊరు, తెలకలవీధి, జెడ్.పి.హెచ్.ఎస్.ఏరియా, ప్రశాంతినగర్, క్రాంతినగర్, ఉడాకాలనీ, రైల్వేకాలనీ, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడవివరం, ఎస్సీకాలనీ, పాత అడవివరం ప్రాంతాల్లో మంచినీటి సరఫరా పైపులైన్ ద్వారా జరగదని, ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని ఆయన కోరారు.



జాతీయ రహదారి షీలానగర్‌లో జంక్షన్‌లో పొగమంచు



శ్రీనగర్‌లో గృహ సముదాయాలను కమ్మేసిన మంచు

పారిశ్రామిక ప్రాంతంపై మంచు దుప్పటి

- ఏజెన్సీని తలపించిన వాతావరణం
- హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించిన వాహనదారులు



మంచు తెరల్లో కొత్త నక్కవానిపాలెం కూడలి

కూర్మన్నపాలెం/మల్కాపురం/అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతాన్ని శనివారం ఉదయం మంచు దుప్పటి కప్పేసింది. పొగమంచు దట్టంగా కురవడంతో వేకువజామున మార్నింగ్ వాక్ వెళ్లేవారితో పాటు ఏ-షిఫ్ట్‌నకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు కాస్తా ఇబ్బందులు పడ్డారు. మంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేంత వరకు కనిపించకపోవడంతో వాహనదారులందరూ హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. కొన్ని ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది, తొమ్మిది గంటలు దాటేంత వరకు ఇదే పరిస్థితి కొనసాగడంతో శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారితో పాటు వృద్ధులు బయటకు వచ్చేందుకు సాహసించలేదు. కాగా దట్టంగా కురిసిన మంచు ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించేలా ఉందని పలువురు పేర్కొన్నారు. అలాగే సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం, తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం తొమ్మిది గంటల వరకు ఎంతో దట్టంగా పొగమంచు కురిసింది. మంచు కారణంగా కొండ ప్రాంతాల్లో ఉన్న ఇళ్లతో పాటు హెచ్‌పీసీఎల్‌లో నిరంతరం మంటతో కనిపించే చిమ్నీ కూడా కనిపించలేదు. కాగా జాతీయ రహదారి షీలానగర్ జంక్షన్, పరిసర ప్రాంతాల్లో పొగమంచు భారీగా కురవడంతో వాహనదారులతో పాటు పాదచారులు ఇక్కట్లకు గురయ్యారు. ద్విచక్ర వాహనదారులందరూ చాలా జాగ్రత్తగా వాహనాలను నడుపుతూ విధులకు హాజరయ్యారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన

- వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లపాటు జగన్ హయాంలో రాష్ట్రం అన్నివిధాలా నష్టపోయిందన్నారు. దీంతో అటు పాలన, ఇటు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నారన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన ఏడు నెలల్లోనే రూ. ఆరు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులన్నీ గతంలో తమ హయాంలో చేసుకున్న ఒప్పందాల మేరకేనని వైసీపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. జగన్ పాలన నచ్చకే ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని పాతాళానికి తొక్కేశారని వ్యాఖ్యానించారు. జగన్ పాలనతో రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుందని, ప్రతినెలా రూ.71 వేల కోట్ల అప్పులకే ఇప్పుడు కట్టాల్సి వస్తుందని గండి బాబ్జీ పేర్కొన్నారు.

వైసీపీ నాయకుల వ్యాఖ్యానాలను ప్రజలంతా గమనిస్తున్నారని, అందువల్ల వారంతా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ చొరవ వల్లే స్టీల్‌ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీని ప్రకటించిందన్నారు. రాష్ట్రానికి పలు పరిశ్రమలు వస్తున్నాయని, వాటి ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, రాష్ట్రానికి పన్నుల రూపంలో ఆదాయం సమకూరనున్నదని బాబ్జి అన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గొంప సత్యనారాయణ పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల్లో విధులను గౌరవంగా భావించాలి

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ సీఈవో నరసింహమూర్తి



పీవీ నరసింహమూర్తి దంపతులను సన్మానం చేస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో పని చేయడాన్ని ప్రతి ఉద్యోగి గౌరవంగా భావించాలని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ (వీసీబీ) సీఈవో పీవీ నరసింహమూర్తి పేర్కొన్నారు. వీసీబీ సీఈవోగా నరసింహరావు పదవీ విరమణ పొందిన సందర్భంగా శనివారం మద్దిలపాలెంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ సహకార రంగం మెరుగైన సమాజానికి దోహదపడుతుందన్నారు. సహకార బ్యాంకుల్లో పని చేసే ఉద్యోగులు అంకితభావంతో పని చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని వృత్తిలో రాణించాలన్నారు. వీసీబీ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, డైరెక్టర్లు, ఉద్యోగుల సహకారంతో సమర్థవంతమైన సేవలు అందించగలిగానన్నారు. వీసీబీ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు మాట్లాడుతూ నరసింహమూర్తి బ్యాంక్ డైరెక్టర్‌గా ముందుముందు సేవలు అందించాలన్నారు. పేదలు, సామాన్యులు డిపాజిటర్లుగా ఉన్న కో-ఆపరేటివ్ బ్యాంకుల అభివృద్ధికి పాలకమండలి పటిష్ఠంగా పని చేయాలన్నారు. అనంతరం పీవీ నరసింహమూర్తి దంపతులకు బ్యాంకు ఉద్యోగులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో వీసీబీ డైరెక్టర్లు ఏజే స్టాలిన్, జేవీ సత్యనారాయణమూర్తి, ఆదినారాయణ శాస్త్రి, నాగభూషణ చౌదరి, జి.జనార్దనరావు, ఎన్.కామరాజు, కె.ప్రసాదరావు, డి.బాబూరావు, పలు శాఖల వీసీబీ బ్రాంచ్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రోగులకు అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నందుకు గాను మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు లభించినట్టు ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం హోటల్ మేఘాలయలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఇండియా (ఏహెచ్‌పీఐ) పేషెంట్ సెంట్రిక్ విభాగంలో ఈ అవార్డును అందించినట్టు పేర్కొన్నారు. రోగి సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు రిస్క్ మేనేజ్‌మెంట్, రోగి సంతృప్తి, వ్యాధి పట్ల రోగికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించడం, చికిత్స వివరాలను తెలియజేయడం, పేషెంట్ కోలుకున్న ఫలితం వంటి అంశాలను పరిశీలించి ఈ అవార్డు అందించినట్టు ఆయన తెలిపారు.

నూతన వైద్య విధానాలపై వైద్యులకు అవగాహన అవసరం

విశాఖపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో వస్తున్న అధునాతన వైద్య విధానాలపై వైద్యులు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అవకాశం ఉంటుందని ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. నవ్యాంధ్ర ఆర్థోపెడిక్ సర్జన్ల అసోసియేషన్, కేజీహెచ్‌లోని ఆర్థో విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహిస్తున్న ఆర్థోపెడిక్ సర్జన్ల సదస్సు మూడో రోజైన శనివారం కొనసాగింది. ఇందులో భాగంగా డాక్టర్ జి.నరసింహారెడ్డి స్మారక ప్రసంగాన్ని సోలాపూర్‌కు చెందిన డాక్టర్ శివశంకర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకల వైద్య విభాగానికి సంబంధించి ప్రస్తుతం అందుబాటులో నూతన విధానాలు, అనుసరిస్తున్న పద్ధతులను వివరించారు. మరో వైద్య నిపుణుడు డాక్టర్ యగ్రీశ్వరుడు స్మారకార్థం ఉపన్యాసంలో గంగా ఆస్పత్రి చైర్మన్, ప్రముఖ ఎముకల వైద్యుడు డాక్టర్ రాజశేఖరన్ మాట్లాడుతూ ఈ తరహా సదస్సులు, లైవ్ సర్జరీలతో పీజీ విద్యార్థులకు, యువ వైద్యులకు మేలు చేకూరుతుందన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శివానంద, సెక్రటరీలు డాక్టర్లు లోకనాథం, వర్మ, లీలాప్రసాద్, నాయుడు, అకడమిక్ సెషన్స్ ఇన్‌చార్జి డాక్టర్ భవానీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

కొట్టడం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తున్న తల్లిదండ్రులు



మృతుడు భాస్కరరావు (ఫైల్ ఫొటో)

గాజువాక, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గాజువాక సమీపం శ్రీనగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం ఫూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన జి.భాస్కరరావు (24) శ్రీనగర్‌లో అద్దెకు నివాసం ఉంటూ ఫార్మాసిటీలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం భాస్కరరావు తమ పక్క ఇంట్లో ఉంటున్న ఓ యువతి స్నానం చేస్తుండగా వీడియో తీశాడు. ఈ విషయం తెలిసి ఆ యువతి తల్లిదండ్రులు నిలదీయడంతో పాటు భాస్కరరావు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు విజయనగరం నుంచి ఇక్కడకు వచ్చారు. అయితే అప్పటికే ఫ్యాన్ హుక్‌కు భాస్కరరావు ఉరి వేసుకుని మృతి చెందాడు. అయితే భాస్కరరావు ఆత్మహత్య చేసుకోలేదని, కొట్టడం వల్లే మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. భాస్కరరావు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో యువతితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వీఎంఆర్డీఏలో ప్రజాదర్బార్ తాత్కాలికంగా రద్దు

విశాఖపట్నం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మెల్సీ (గ్రాడ్యుయేట్) ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోని ఉన్నందున ప్రతి సోమవారం వీఎంఆర్డీఏలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ ఈ నెల 3న నిర్వహించడం లేదని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. తిరిగి మార్చి 10న నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

నేడు బంగారమ్మ తీర్థం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నాతయ్యపాలెం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఐఐఎంలో సమావేశం

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో శనివారం ఎంటర్‌ప్రెన్యూర్స్ సమావేశాన్ని నిర్వహించారు. 500 మంది వరకు స్టార్టప్ వ్యవస్థాపకులు, ఎంటర్‌ప్రెన్యూర్స్, ఇన్వెస్టర్స్, ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, విద్యార్థులు, పలు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ ఎం సమీర్ జావెద్ పలు అంశాలను వివరించారు. పీర్ క్యాపిటల్ మేనేజింగ్ పార్టనర్ కార్తిక్ ప్రభాకర్, ఫాబ్‌మార్ట్ అండ్ ఇండియా ప్లాసా ఫౌండర్ కె.వైతేశ్వరన్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మదగజరాజా:** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **మహిష:** రమాదేవి
- **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 29, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజీ 12, క్యారెట్ 24, దొండకాయలు 36, బంగాళదుంపలు 16, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 44, మునక్కాడలు (కిలో) 100, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 32, క్యాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 36, కంద 56, దేముడుచిక్కుడు 24, గోరుచిక్కుడు 26, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, మామిడికాయలు 120, క్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220